## రియాల్టీ పల్టీ

(మొదటిపేజీ తరువాయి)

అందజేస్తామని చెప్పినా.. కొను గోలుదారులు ఆసక్తి చూపడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. ఇటీవల ఓ నిర్మాణ సంస్థ మార్కెటింగ్ ఆఫర్లతో నేరుగా కస్టమర్లకు రూ. లక్ష క్యాష్ బ్యాక్ సదుపాయాన్ని అందిస్తూ పెద్ద ఎత్తున్న ప్రచారం చేస్తున్నా... సైట్ విజిటింగ్ ఫుట్‌ఫాల్స్‌లో ఏ మాత్రం మార్పు లేదని మార్కెటింగ్ సిబ్బంది అసహనానికి గురవుతున్నారు.

### 30-40 శాతం లావాదేవీలు డౌన్...

బడా కార్పొరేట్ రియల్ ఎస్టేట్ కంపెనీలు కూడా కొత్త ప్రాజెక్టులను లాంచింగ్ చేయడం కంటే... ప్రాజెక్టుల్లోని ఇన్వెంటరీ క్లియరెన్స్‌పై దృష్టి పెట్టాయి. ఎప్పుడో హ్యాండోవర్ అయ్యే ఫ్లాట్ల కంటే రెడీ టూ మూవ్ ఫ్లాట్లను అందుబాటులోకి తీసుకువస్తున్నాయి. అయినా రెండేండ్ల కిందటితో పోల్చితే 30–40 శాతం అమ్మకాలు, బుకింగ్ తగ్గినట్లు నిర్మాణ సంస్థలు చెబుతున్నాయి. ఇక రెడీ టూ మూవ్ ప్రాజెక్టులలో కస్టమర్లను ఆకట్టుకునేలా ప్రోత్సాహకాలు, రాయితీలను ప్రకటించాల్సి వస్తున్నా... క్రయ విక్రయాలు పుంజుకునే అవకాశం కల్పించడం లేదని ఆవేదన చెందుతున్నారు. మార్కెట్‌లో ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో... ఉన్న ఇన్వెంటరీ తగ్గితే... కొంత ఆర్థికంగా వెసులుబాటు వస్తుందని భావించి.. మార్కెటింగ్ రిస్క్ చేస్తున్నామని వ్యాపారులు, మార్కెటింగ్ సంస్థలు లెక్కలు వేసుకుంటున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి సిటీ రియాల్టీ తిరోగమన పర్వంగా ఇంకెన్నాళ్లు అనేది ఇప్పటికీ అంతు చిక్కని వ్యవహారంగా మారింది.

## టౌన్ ప్లానింగ్ అధికారులకు స్థానచలనం

సిటీ బ్యూరో, జూన్ 21 (నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీలో 27 మంది టౌన్ ప్లానింగ్ అధికారులను బదిలీ చేస్తూ బల్దియా కమిషనర్ ఆర్వీ కర్ణన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల పలువురు అధికారులపై అవినీతి ఆరోపణలు రావడంతో కమిషనర్ టౌన్ ప్లానింగ్ సెక్షన్‌ను ప్రక్షాళన చేస్తున్నారు. ఇటీవల కొంతమంది అధికారులు ఏసీబీకి పట్టుబడటంతో వారి స్థానచలనంపై కమిషనర్ ఫోకస్ చేశారు. బల్దియాలో సెక్షన్ ఆఫీసర్లుగా కొంత మందికి ఏసీపీలుగా పదోన్నతి కల్పిస్తూ పోస్టింగ్‌లు ఇచ్చారు.

## జలమండలి పీఅండ్‌ఏ సీజీఎంగా సురేశ్

సిటీబ్యూరో, జూన్21, (నమస్తే తెలంగాణ): జలమండలి పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్ వింగ్ సీజీఎంగా సురేశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జీఎం(పీఅండ్ ఏ)గా పనిచేస్తున్న ఆయన సీజీఎం(పీఅండ్ ఏ)గా పదోన్నతి పొందారు. ఈ నేపథ్యంలోనే శనివారం ఆయన ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో ఎండీ అశోక్ రెడ్డిని ఆయన చాంబర్ లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎండీ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఆదిమానవుడి జీవన శైలిపై అవగాహన

సిటీబ్యూరో, జూన్ 21 (నమస్తే తెలంగాణ): ఆదిమానవుడి జీవన శైలి, అంత్యక్రియల ఆచారాలపై డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్, తెలంగాణ హెరిటేజ్ విభాగం ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లాలోని ముడుముల్ మేగలిథిక్ మైనిర్స్ వద్ద మూడు రోజులుగా అవగాహన సదస్సులు నిర్వహించారు. ఓ యూ పురావస్తు విభాగం విద్యార్థులు, అధ్యాపకులు సందర్శించారు.

## దరఖాస్తుల ఆహ్వానం

సుల్తాన్ బజార్, జూన్ 21: రంగారెడ్డి రీజియన్‌లోని టీఎస్ఆర్టీసీ డిపోలు, యూనిట్లలో శిక్షణ పొందేందుకు అర్హులైన ఇంజినీరింగ్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రంగారెడ్డి రీజియన్ రీజినల్ మేనేజర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. విద్యార్థులు డిప్లొమా,బీఈ, బీటెక్ మెకానికల్, ఆటోమొబైల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. 2020 నుంచి 2025 మధ్యలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారై ఉండాలని తెలిపారు. నాట్స్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ కలిగిన అభ్యర్థులు మాత్రమే అర్హులని అన్నారు. మూడు సంవత్సరాల శిక్షణ కాలం ఉంటుందన్నారు.

# పంటలు చూసి.. భరోసా ఇవ్వండి

- రియల్ బూచి చూపించి.. ఎగ్గొట్టే ప్రయత్నం చేయకండి
- కాంగ్రెస్ సర్కారు తీరుపై ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ధ్వజం
- క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన



మహేశ్వరం మండలం డబిల్‌గూడలోని బాల్‌రాజ్, జంగయ్య పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, జూన్ 21: మహేశ్వరం మండలంలో పంటలు చూసైనా..రైతు భరోసా ఇవ్వాలని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రియల్ బూచి చూపించి.. ఎగ్గొట్టే ప్రయత్నం చేయవద్దన్నారు. శనివారం మహేశ్వరం మండల పరిధిలోని మన్‌సాన్‌పల్లి గ్రామంలో ఉన్న రైతులు యాదమ్మ, జంగయ్య, బాల్‌రాజ్ వేసిన వరి, చిక్కుడు పంటలను ఆమె బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో ఉన్న 19 మండలాల్లో రైతు భరోసాను నిలిపివేయడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లాలో మొత్తం రియల్ ఎస్టేట్ వ్యాపారమే ఉందని, రైతులు వ్యవసాయం చేయడం లేదన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి దాదాపుగా రెండు లక్షల ఎకరాల పొలాలకు సంబంధించిన రైతు భరోసా ఇవ్వకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రంగారెడ్డి జిల్లాలో నిజంగా రైతులు వ్యవసాయం చేస్తున్నారో, చేయడం లేదో క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా కేబినెట్ తీర్మానం చేయడం ఏమిటని ప్రశ్నించారు. రంగారెడ్డి జిల్లా రైతులపై ముఖ్యమంత్రి కక్షగట్టారన్నారు. ముఖ్యమంత్రికి చూపించేందుకే రైతులు వేసిన పంటల వద్దకు వచ్చామన్నారు. అధికారంలోకి రావడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు అనేక హామీలను ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేకనే రైతు భరోసాను ఇవ్వడం లేదన్నారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటివరకు రైతు భరోసా రాలేదని రైతులు బాలరాజ్, జంగయ్య, యాదమ్మ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి వివరించారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో సమయానికి రైతుబంధు అందినట్లు చెప్పారు. రైతులను కలిసిన తర్వాత ఎమ్మెల్యే మన్సన్‌పల్లి రోడ్డును పరిశీలించారు. అభివృద్ధి పనులను వేగవంతంగా చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాండు యాదవ్, వెంకటేశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భక్తులు ఇబ్బందులు పడొద్దు

- అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేయాలి
- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్
- మహంకాళి ఆలయ పరిసరాలు పరిశీలన



ఉజ్జాయినీ మహంకాళి ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి,ఎమ్మెల్యే తలసాని

బేగంపేట, జూన్ 21: మహంకాళి అమ్మవారి జాతరకు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. శనివారం సికింద్రాబాద్‌లోని ఉజ్జాయినీ మహంకాళి ఆలయ పరిసరాల్లో పర్యటించారు. కాలినడకన తిరుగుతూ ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని మాట్లాడుతూ ఆషాఢ మాసంలో నిర్వహించే బోనాలు అంటేనే గోల్కొండ, సికింద్రాబాద్, ఓల్డ్ సిటీ ప్రాంతాల్లో ఎంతో సందడి నెలకొంటుందన్నారు. ఈ సంవత్సరం నిర్వహించే మహంకాళి అమ్మవారి జాతరకు లక్షలాది మంది భక్తులు వస్తారని తెల్లవారుజామున 3 గంటల నుంచే అమ్మవారికి బోనాలు సమర్పిస్తారని తెలిపారు. ఒక్క హైదరాబాద్ నగరం నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కూడా భక్తులు వస్తారని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని వివిధ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఏర్పాట్లు చేయాలన్నారు. శాంతిభద్రతల పర్యవేక్షణ కోసం అదనపు పోలీసు సిబ్బందితో పాటు, షీటీమ్స్, మఫ్టీ పోలీసులను నియమించాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆలయ పరిసరాల్లో రోడ్ల మరమ్మతులు, టాయిలెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మహంకాళి ఆలయానికి ప్రతి సంవత్సరం బోనాల నిర్వహణ కోసం రూ. 10 లక్షల చొప్పున మంజూరు చేసినట్లు వివరించారు. భక్తులకు స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్న దక్కన్ మానవ సేవా సమితి, ఆర్య సమాజ్ తదితర స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలు, వ్యాపారుల సహకారంతో అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్ డాకు నాయక్, ఈఈ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# ఎట్ల కూలుస్తరో చూస్తం

(మొదటిపేజీ తరువాయి)

ఎన్‌వోసీ, ఎల్‌ఆర్‌ఎస్ అనుమతులు పొంది ఇండ్ల నిర్మాణం చేసుకున్నారని తెలిపారు. నిర్బంధ నోటీసులు జారీచేయాలని చూస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదన్నారు. నగరం చుట్టూ ఉన్న చెరువుల్లోని ఎఫ్‌టీఎల్ పరిధిల్లో అనేక వెంచర్లు కొనసాగుతున్నా పట్టించుకోని అధికారులు.. దాదాపు 25 ఏండ్ల కిందట ఇండ్ల నిర్మాణాలు చేసుకున్నవారికి నోటీసులు జారీ చేయడం వింతగా ఉందన్నారు.

### మాకు న్యాయం చేయాలి

రెవెన్యూ, మున్సిపల్ అనుమతులతోనే పదేండ్ల కిందట స్థలం కొనడంతో పాటు ఇంటి నిర్మాణం చేపట్టాం. ప్రభుత్వానికి మున్సిపల్ ట్యాక్స్, విద్యుత్, వాటర్ బిల్ అన్నీ చెల్లిస్తున్నాం. అయినా ఇప్పుడు వచ్చి చెరువు శిఖం భూమి అంటూ నోటీసులు జారీ చేశారు. పేదలను కావాలనే వేధిస్తున్నారు. మాకు న్యాయం చేయాలి.

– సఫియా ఫాతిమా, కుబాకాలనీ

### అధికారులపై చర్యలు తీసుకోవాలి

కష్టపడి సంపాదించిన సొమ్ముతో కట్టుకున్న ఇండ్లను కూలుస్తామంటే ఎక్కడికి వెళ్లాలి. 25 ఏండ్ల తర్వాత అధికారులు వచ్చి నోటీసులు ఇవ్వడం ఏంటి. ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్నప్పుడు వెంచర్లు, స్థలాలకు అనుమతులు ఇవ్వడం అధికారుల తప్పిదమే. నిర్మాణాలకు అనుమతులు జారీచేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి.

– బదర్ భాయ్, కుబాకాలనీ

# సమస్యల జాతర!

(మొదటిపేజీ తరువాయి)

ఉండాలని అధికారులు, మంత్రులు సూచించినప్పటికీ పలు శాఖల మధ్య సమన్వయలోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. జీహెచ్‌ఎంసీ సిబ్బందితో పాటు క్షేత్రస్థాయిలో పలువురు అధికారులు అసలు పట్టింపు లేకుండా ఉంటున్నారని, గత సంవత్సరం జరిగిన లోపాలపై సమీక్షల్లో ఎన్నిసార్లు చెప్పినా పనులు చేస్తామని చెప్పి ఆచరణలో నామమాత్రంగా చేస్తున్నారంటూ దేవాలయాల కమిటీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

### శాఖల మధ్య సమన్వయ లోపం..

రాష్ట్ర పండుగ బోనాల జాతర నిర్వహణకు సంబంధించి వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. ఈ విషయాన్ని బోనాల ఏర్పాట్లను పరిశీలించేందుకు వెళ్లిన దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ స్వయంగా పలు శాఖల ఉన్నతాధికారులతో అన్నారు. బోనాల జాతరకు ఏర్పాట్లు చేయాల్సిన జీహెచ్‌ఎంసీ, విద్యుత్, డీఎంహెచ్‌వో సిబ్బంది సకాలంలో రావడం లేదని, అంతేకాకుండా వారు నిర్వర్తించాల్సిన విధులు సక్రమంగా చేయడం లేదంటూ తమ శాఖా మంత్రికి ఫిర్యాదు కూడా చేసినట్లు తెలిసింది.

### పురోగతి లేదు..

గోల్కొండ వద్ద బోనాల నిర్వహణకు సంబంధించి కోటపైకి ఎక్కే ర్యాంపులకు మరమ్మతులు చేపట్టడంపై పనుల్లో పురోగతి లేదు. ఇక గత సంవత్సరం బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద కల్యాణానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చినప్పుడు మంత్రులే ఇబ్బంది పడ్డారు. అప్పుడు రూట్ మ్యాప్ లేక పోవడంతో ఇబ్బందులయ్యాయి. ఈసారి కూడా రూట్‌మ్యాప్ విషయంలో ఏం చేస్తున్నారనేది ఉత్సవ కమిటీలకు సమాచారం ఇవ్వకుండానే పనులు చేస్తున్నారన్న విమర్శలు వినిపించాయి. బోనాలు జరిగే ముఖ్య ఆలయాల్లో మహిళలు బోనాలు సమర్పించుకోవడానికి బ్యారికేడింగ్ సరిగా చేయకపోవడంవల్ల వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్ల విషయంలోనూ భక్తులకు కావాల్సినట్లుగా ఏర్పాట్లు చేస్తామని ప్రతీ సమావేశంలో చెప్పినా ఇంతవరకూ పనులే పూర్తి కాలేదు. వీఐపీ పాసుల గోల చాలా పెద్దదిగా ప్రతీసారి ఉంటుందని ఈసారి పాసులు తగ్గిస్తామని దేవాదాయశాఖ, పోలీసులు చెబుతున్నా ప్రభుత్వ పెద్దల నుంచి వస్తున్న ఒత్తిడులు మళ్లీ యథాస్థితిలోనే పాసులు జారీ అయ్యే పరిస్థితి ఉన్నదని దేవాదాయ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

### సప్త మాతృకల సప్త బంగారు బోనాలు..

ఈసారి సప్త మాతృకలకు సప్త బంగారు బోనాలను సమర్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. జూన్ 26న గోల్కొండ అమ్మవారికి బంగారు బోనం సమర్పిస్తారు. ఈ బోనాన్ని జోగిని నిషాక్రాంతి ఎత్తుకుంటారు. జూన్ 29న విజయవాడ కనకదుర్గ అమ్మవారికి జోగిని శ్యామల బంగారు బోనం సమర్పిస్తారు. విజయవాడలో జూలై 2 బల్కంపేట ఎల్లమ్మ, జూలై 4న జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లికి, జూలై 10న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి, జూలై 15న చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి, జూలై 17న లాల్‌దర్వాజ సింహవాహిని అమ్మవారికి బంగారు బోనాలు సమర్పిస్తామని ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్ తెలిపారు. వచ్చేనెల 11న ధ్వజారోహణ, కలశస్థాపన, శిఖరపూజ, బోనాలు జరుగుతాయి. 13వ తేదీ ఆదివారం ఘటాల ఊరేగింపు , శాలిబండ విశ్వనాథ్ ఆలయం నుంచి 29 దేవాలయాలకు సంబంధించిన ఘటాల ఊరేగింపు మొదలై ఆయా దేవాలయాల వరకు వెళ్లి అక్కడ ఘటస్థాపన జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. 14వ తేదీ నుంచి 19వ తేదీ వరకు దేవాలయాల్లో వారివారి సంప్రదాయం ప్రకారం కుంకుమార్చనలు, హోమాలు, లక్ష పుష్పార్చనలు, అభిషేకాలు జరుగుతాయి. 20న బోనాల పండుగ, 21న రంగం, లక్షలాది మందితో ఊరేగింపు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అమ్మవారి ఘటం అంబారీపై తీసుకొచ్చి నయాపూల్‌లో ఉన్న ఢిల్లీ దర్వాజ ఆలయం వద్దకు చేరడంతో జాతర ముగుస్తుంది. ఈ నెల 29న హరిబౌలిలోని అక్కన్నమాదన్న ఆలయం నుంచి భాజాభజంత్రీలతో కళాబృందాలు, పోతరాజుల నృత్యప్రదర్శనలు నిర్వహించి విజయవాడకు బయలుదేరనున్నట్లు అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్ తెలిపారు. ముందుగా అక్కన్న మాదన్న దేవాలయంలో అమ్మవారి వద్ద బంగారు పాత్రకు ప్రత్యేక పూజలు నిర్వహించి విజయవాడ బయలుదేరుతారు. విజయవాడ బ్రాహ్మణవీధి నుంచి కనకదుర్గమ్మ ఆలయం వరకు కళాబృందాల నృత్యప్రదర్శనలతో సామూహిక తెలంగాణ బోనాల జాతర ఊరేగింపు నిర్వహించనున్నారు. ఈ యేడు కూడా కృష్ణానదిలో గంగతెప్పకు పూజల అనంతరం బంగారు బోనంతో పాటు పట్టువస్త్రాలు, నైవేద్యం సమర్పించనున్నామని ఆయన పేర్కొన్నారు.

**బోనాల జాతర షెడ్యూల్**

26న గోల్కొండ బోనాలతో ప్రారంభం, జూలై 13న రోజున సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాలు, అదేరోజు పాతబస్తీలో అమ్మవారి ఘటస్థాపన, ఊరేగింపు, 29 దేవాలయాల ఘటాలు శాలిబండలోని విశ్వనాథాలయం నుంచి ఆయా దేవాలయాల వద్దకు ఊరేగింపు, 20నలాల్‌దర్వాజ మోడ్ వద్ద ఏర్పాటు చేసే స్వాగత వేదికపై నుంచి అధికార, అనధికార ప్రముఖులు పాల్గొని అమ్మవారి ఘటాలకు స్వాగతం పలకనున్నారు. 20న బోనాల పండుగ..పాతబస్తీతో పాటు నగరంలోని అన్ని ప్రాంతాల్లో బోనాలు,21న పాతబస్తీలో అమ్మవారి ఘటాల సామూహిక ఊరేగింపు, రంగం కార్యక్రమం ఉంటుంది.

## సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను నిషేధించాలి



డీఆర్‌వో వెంకటాచారి

సిటీ బ్యూరో, జూన్ 21 (నమస్తే తెలంగాణ): జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగ నిషేధానికి పకడ్బందీ చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి తెలిపారు. శనివారం హైదరాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ప్లాస్టిక్ రహితంగా, శుభ్రత, పచ్చదనంతో ఉండేలా చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామన్నారు. గతంలో జీహెచ్‌ఎంసీలో జోనల్ కమిషనర్‌గా సేవలందించిన కలెక్టర్ హరిచందన పర్యావరణ పరిరక్షణకు వినూత్న కార్యక్రమాలు చేపట్టి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందారని గుర్తు చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై కార్యాలయ అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించామన్నారు. ఈ సమావేశంలో సీపీఓ డాక్టర్ సురేందర్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ రెడ్డి, డీఎంహెచ్ఓ కోటాజి, ఆర్టీవో ఖైరతాబాద్ పురుషోత్తం రెడ్డి, హెచ్‌ఎండీఏ అర్బన్ ఫారెస్ట్ మేనేజర్ ప్రణీత్ కౌర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

# హన్మంత్ రెడ్డి ఓ బ్లాక్ మెయిలర్

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉంటూ అక్రమ వసూళ్లు
- నీ భూ దందాలపై ప్రజలే బుద్ధి చెబుతారు
- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను విమర్శించే స్థాయి నీదికాదు
- బీఆర్ఎస్ నియోజకవర్గ శ్రేణుల ఆగ్రహం

కుత్బుల్లాపూర్, జూన్ 21: హైడ్రా పేరు చెప్పుకొని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న బ్లాక్ మెయిలర్ కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోలన్ హన్మంత్ రెడ్డికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను విమర్శించే నైతిక హక్కు లేదని టీఆర్ఎస్ నియోజకవర్గ శ్రేణులు హెచ్చరించారు. శనివారం చింతల్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గెలిచిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను విమర్శించే స్థాయి నీది కాదన్నారు. హైడ్రా పేరుతో వసూళ్ల దందా చేసి, నీచ రాజకీయాలకు తెరలేపుతూ బిల్డర్లను, నిర్మాణదారులను ముప్పతిప్పలు పెడుతున్న తీరుపై త్వరలోనే ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఎన్నికల్లో ఓడిపోయి స్థానికంగా ఉండకుండా జూబ్లీహిల్స్ లో ఉంటున్న హన్మంత్ రెడ్డి.. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. మొన్నటి ఎన్నికల్లో నీవు మూడో స్థానానికి పడిపోయినా ఇంకా బుద్ధి రాలేదన్నారు. 18 నెలలుగా కాంగ్రెస్ పాలనలో హైడ్రా పేరుతో ప్రజలను భయపెడుతూ నీవు చేసే వసూళ్లపై నిజాంపేట్ లో ఏ బిల్డర్‌ను అడిగిన చెబుతారన్నారు. బాచుపల్లి సాయి నగర్ లో దొంగ పట్టాలు తయారు చేసి అమ్మితే టీడీపీ నుంచి గెంటేసింది వాస్తవం కాదాఅని ప్రశ్నించారు. బాచుపల్లి, మల్లంపేట్, భౌరంపేటలలోని చెరువులు, నాలాలపై నీవు చేసిన ఆక్రమణలపై జైలుకు పోవాల్సిందన్నారు. గత పదేళ్లలో ఐదు సంవత్సరాలు బీఆర్ఎస్ లో ఉండి తర్వాత అమ్ముడుపోయిన నీవు అప్పుడు నిద్ర పోయినావా..? ఇప్పుడు చెరువులు, కుంటలు అనుకుంటూ ప్రగల్భాలు పలుకుతున్నావని ప్రశ్నించారు. నీకు రాజకీయ భిక్ష పెట్టిందే బీఆర్ఎస్ పార్టీ అని ఒకసారి జడ్పీటీసీగా, మరొకసారి ఎమ్మెల్యేకి అవకాశం కల్పించిదని గుర్తు చేశారు. హన్మంత్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకో, లేదంటే కుత్బుల్లాపూర్ ప్రజలు రాజకీయ భూస్థాపితం చేస్తారని హెచ్చరించారు. ఈ సమావేశంలో కస్తూరి బాలరాజు, దుదిమెట్ల సోమేశ్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు అశోక్, శంకరయ్య, నాయకులు అడ్వకేట్ కమలాకర్, వేణు యాదవ్, కుంట సిద్ధిరాములు, జ్ఞానేశ్వర్, యేసు, నదీమ్ రాయ్, ఆటో బలరాం, నార్లకంటి శ్యాం, నార్లకంటి కుమార్, కుంట వేణు, తెలంగాణ సాయి, గణేశ్, బాల మల్లేశ్, శ్రీకాంత్, సాజిద్, మోసిన్ తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



యోగా చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ హరిచందన



స్టార్ దవాఖానలో ..

సిటీ బ్యూరో, జూన్ 21(నమస్తే తెలంగాణ): ప్రకృతిని ఆస్వాదిస్తూ నిత్యం యోగాసనాలు చేయడం వల్ల ఎలాంటి వ్యాధులకు గురికాకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శనివారం డీఈఓ, డీఎంహెచ్ఓ, ఆశవర్కర్ల ఆధ్వర్యంలో బంజారాహిల్స్ కేబీఆర్ పార్కులో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఆయన పాల్గొని యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతతకు, జీవన శైలిలో సమతుల్యతకు యోగా ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, దినచర్యలో భాగంగా యోగాను భాగం చేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి మాట్లాడుతూ సమాజంలో ఆరోగ్యవంతమైన జీవనం గడిపేందుకు ప్రభుత్వం ఆశ వర్కర్లకు శిక్షణ ఇస్తుందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ ముకుంద రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, డీఈవో రోహిణి, ఆర్డీవోలు రామకృష్ణ, సాయిరాం, జిల్లా అధికారులు, ఆశవర్కర్లు, వైద్యశాఖ, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



డీఎంహెచ్ఓ కార్యాలయంలో..



నేషనల్ స్టాటిస్టిక్స్, ఆర్వో కార్యాలయంలో ..



### సనాతన ధర్మంలో యోగా భాగం

సిటీ బ్యూరో, జూన్ 21 (నమస్తే తెలంగాణ): యోగా అనేది సనాతన ధర్మంలో భాగమని స్వామి రామ్‌దేవ్ బాబా అన్నారు. దీన్ని ప్రస్తుతం 200 దేశాల్లో 200 మంది ప్రజలు అనుసరిస్తున్నారని తెలిపారు. కురుక్షేత్రంలో పతంజలి యోగాపీఠం, హర్యానా యోగా కమిషన్, హర్యానా ఆయుష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రపంచ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో హర్యానా సీఎం నాయబ్ సింగ్‌షైనీ తదితరులు పాల్గొన్నారు.

### యోగా డేలో తోపులాట

నర్సింగ్ విద్యార్థినికి అస్వస్థత



శేరిలింగంపల్లి, జూన్ 21: గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా డే కార్యక్రమంలో తోపులాట చోటు చేసుకుంది. గాంధీ దవాఖానకు చెందిన నర్సింగ్ విద్యార్థిని స్వల్ప అస్వస్థతకు గురైంది. వివరాల్లోకి వెళితే.. శనివారం ప్రభుత్వం గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి అథ్లెటిక్ స్టేడియంలో నిర్వహించిన యోగా డే కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన వారందరికి అల్పాహారం ఏర్పాటు చేశారు. టిఫిన్ అయిపోవడంతో మళ్లీ మరో ట్రాలీలో తీసుకొచ్చారు. కాగా టిఫిన్ కోసం టోకెనులతో వేచి ఉన్న వారు ఒక్కసారిగా ఎగబడ్డారు. ట్రాలీ వద్ద తోపులాట చోటుచేసుకుంది. ఈ తోపులాటలో గాంధీ నర్సింగ్ విద్యార్థిని నజీమాను మెడ, కడుపుపై తొక్కడంతో అస్వస్థతకు గురైంది. అధికారులు వెంటనే ఆమెను కొండాపూర్ జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. సిటీస్కాన్‌కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. గాంధీలో నజీమాను పరీక్షించిన వైద్యులు అవసరమైన వైద్య చికిత్సలందించి ఆరోగ్యం నిలకడగా ఉండటంతో డిశ్చార్జ్ చేశారు.


## నాలా పనుల్లో వేగం పెంచాలి

సిటీబ్యూరో, జూన్ 21(నమస్తే తెలంగాణ): ప్యాట్నీ నాలా పనుల్లో వేగం పెంచాలని, కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు ఇరువైపులా రిటైనింగ్ వాల్ పనులు త్వరగా జరిగేలా చూడాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. శనివారం కంటోన్మెంట్ సీఈవో మధుకర్‌నాయక్‌తో కలిసి పాట్నీ నాలా పనులను రంగనాథ్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

### రుణాలిచ్చేముందు చూసుకోవాలి

ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు ఒక కల అని, ఆ కల సాకారం చేయడంలో బ్యాంకర్ల పాత్ర కీలకమని, అయితే ఇల్లు కొనేందుకు బ్యాంకులు రుణాలిచ్చేముందు అన్ని విధాలా పత్రాలు సరిచూసుకోవాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సూచించారు. శనివారం బేగంపేటలోని హోటల్ ప్లాజాలో ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ వాల్యూయర్స్(ఐఓవీ), రిజిస్టర్డ్ వాల్యూయర్స్ ఫౌండేషన్, ఐఓవీ హైదరాబాద్ బ్రాంచ్ సంయుక్త ఆధ్వర్యంలో వాల్యుయేషన్ ఇన్ ఏ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఎరా అనే అంశంపై నేషనల్ సెమినార్ నిర్వహించారు. రంగనాథ్ మాట్లాడుతూ గత సంవత్సరం జూలై19న హైడ్రా ఏర్పడిందని, అంతకు ముందు వెలసిన నివాసప్రాంతాలతో పాటు అనుమతులు పొంది నిర్మాణదశలో ఉన్న వాటి జోలికి వెళ్లబోమన్నారు.

## 'ఆరోగ్యరంగంలో కృత్రిమ మేధ' సదస్సు



సిటీబ్యూరో, జూన్21, (నమస్తే తెలంగాణ): ఆరోగ్యరంగంలో కృత్రిమ మేధ విప్లవాత్మక మార్పులు తెస్తోందని, ఇది రోగ నిర్ధారణ, చికిత్స, రోగ సంరక్షణలో అనేక విధాలుగా సహాయపడుతుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. శనివారం హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'విప్లవాత్మక ఆరోగ్య సంరక్షణలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) భాగస్వామ్యం' అంతర్జాతీయ విజ్ఞాన సదస్సుకు యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు గోరుకంటి రవీందర్ రావుతో కలిసి పాల్గొని మాట్లాడారు. 1000 మంది కి పైగా నిపుణులు హాజరుకావడం గమనార్హం.